

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ



**సుఖ్ కే సబ్ సాథీ, దుఖ్ మే న కోయీ**

**మేరె రామ్, తెర నామ్ ఎక్ సాంచా, దూజా న కోయీ...**

ప్రస్తుతం మన సినిమాలలోంచి అదృశ్యమయిన అనేక రకాల పాటలలో భక్తిపాటలు కూడా ఉన్నాయి. నిజానికి భక్తి పాటలంటే పూర్తిగా భక్తిపాటలు కావు. భక్తిపాటల రూపంలో ఆధ్యాత్మక భావాలను, తాత్వికతను, వ్యక్తిత్వ వికాస సూత్రాలను సమాజంలో ప్రచారం చేసేవారు సినీ కళాకారులు. అలాంటి అద్భుతమైన పాటలలో అగ్రస్థానం వహిస్తుంది 'గోపి' సినిమాలో మహమ్మద్ రఫీ పాడిన రాజేంద్రక్రిషన్ రాసిన, కళ్యాణ్ జీ ఆనంద్ జీ స్వరపరచిన ఈ పాట.

మన సినిమాలలో భక్తి, తాత్విక గేయాలను అత్యంత సృజనాత్మకంగా వాడుకున్నారు మన కళాకారులు. భక్తి పాటల ద్వారా కథాగమనానికి ఊపునిచ్చారు. పాత్రల వ్యక్తిత్వాన్ని పరిచయం చేశారు. సినిమా పరిధి దాటి ప్రేక్షకుల వ్యక్తిగత జీవితాలలో మార్గదర్శనం చేసే విధంగా పాటలను రూపొందించారు. వ్యక్తిత్వ వికాసానికి బాటను నిర్మించారు పాటలద్వారా.

'సుఖంలో అందరూ వెంట ఉంటారు. దుఃఖంలో ఎవ్వరూ తోడుండరు. రాముడి నామం ఒకటే సత్యం. మరొకటి లేదు.' ఇదీ ఈ పల్లవి అర్థం. హిందీ సినీ గేయ ప్రపంచంలో రాజేందర్ క్రిషన్ గాన రచనా సంవిధానం గురించి పెద్దగా ప్రస్తావనలు వినిపించవు. సాహిర్, శైలేంద్ర, మజ్రూహ్ ల గురించి అధికంగా విశ్లేషణలు వినిపిస్తాయి. రాజేందర్ క్రిషన్ తన పాటలలో ప్రదర్శించని భావం లేదు. చేయని ప్రయోగంలేదు. కదిలించని హృదయం లేదు. స్పందించని మనస్సులేదు అతని పాటలకు. మజ్రూహ్ లాగా నాలుగు దశాబ్దాల పాటు అగ్రస్థానంలో నిలిచాడు గేయ రచయితగా. 1987లో మరణించకపోయి ఉంటే, మజ్రూహ్ లాగా ఇంకో రెండు దశాబ్దాలు అగ్రశ్రేణి గేయ రచయితగా నిలచి ఉండేవాడు. తరాల అంతరాలు అన్న పదం అర్థం తెలియదనిపిస్తుంది రాజేందర్ క్రిషన్, మజ్రూహ్ లకు. రాజేందర్ క్రిషన్ పాటలలో తేలికయిన పదాలు వాడతాడు. లోతైన భావాలు ప్రదర్శిస్తాడు. సామాన్యుడు ఆ భావాలు విని పరవశిస్తే, పండితులు ముగ్ధులవుతారు. అందుకే 1948 నుంచి 1987 వరకూ అన్ని తరాల ప్రేక్షకులను అలరించే పాటలు రాశాడు రాజేందర్ క్రిషన్.

**జీవన్ ఆనీ జానీ ఛాయా**

**ఝూఠీ మాయా, ఝూఠీ కాయా**

**ఫిర్ కాహేకో సారీ ఉమరియా**

**పాప్ కె గఠరీ ధోయీ.**

చాలా తేలికయిన పదాలలో గొప్ప భావం పొదిగాడు. ఈ సినిమాలో హీరో దిలీప్ కుమార్ అమాయకుడు. మంచి చెడుల నడుమ తేడా తెలిసినవాడు. పాపభీతి కలవాడు. భక్తుడు. సత్ప్రవర్తనకు పెట్టింది పేరు. ఈ పాటద్వారా నాయకుడి వ్యక్తిత్వం, ఆలోచనలు జీవన దృక్పథం వంటి వన్నీ పరిచయం అవుతాయి. 'జీవితం వచ్చీ పోయే నీడలాంటిది. మాయ మోసం. శరీరం అబద్ధం. అయినా జీవితమంతా ఎందుకని పాపాల మూటను శుభ్రం చేస్తూంటాం.

మహమ్మద్ రఫీ ఈ పాటను ఎంతో మృదువుగా, భావాన్ని అనుభవిస్తూ పాడాడు. పాట వింటూంటే భావం మనసు లోతుల్లో స్పందన కలిగిస్తుంది. జీవితం ఎంత క్షణికమో, ఇక్కడ బంధాలన్నీ ఎంత అశాశ్వతమో అర్థమయి కోపాలు, ఆరాటాలు, ద్వేషాలు తలపుకు వచ్చి జీవితం పట్ల అవగాహన కలిగిన భావన కలుగుతుంది. ఈ పాటకు బాణీని కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ 'రాగదర్బారీ'లో కూర్చారు. దర్బారీ రాగం తాన్‌సేన్ సృజించిన రాగం అంటారు. రాజాస్థానంలో పాడే రాగం ఇది. రాగ దర్బారీ గంభీరమైన రాగం. లోతైన భావం ఉండాలి. ఈ రాగంలో లలిత గీతాలలో అధికంగా వాడే ముర్కిలు, ఖట్కాలు వాడరు. మంద్రస్థాయిలో 'మీండ్'లు, ఆందోళనలు (గమకం) వాడుతూ పాట గాంభీర్యం మరింతగా పెరుగుతుంది. 'సుఖ్‌కే సబ్ సాథీ' పాటను రఫీ పాడిన విధానం గమనిస్తే ప్రతి పదం పలకటంలో ఒక భావప్రకటన, చమత్కారాలు కనిపిస్తాయి. 'సబ్‌సాథీ' అనటానికీ 'నకోయీ' అనటంలో రఫీ స్వరం పలికిన విధానాన్ని, తేడాను గమనిస్తే ఎంత సున్నితంగా రఫీ స్వరం భావప్రకటన చేస్తూ, భావానికి తగ్గ 'మూడ్'ను సృజిస్తున్నదో అర్థమవుతుంది. ఇది పాటలో ప్రతి పదాన్ని పలకటంలో కనిపిస్తుంది. మేరె రాం అని రెడుసార్లు పలకటంలో ఎంతో తేడా వుంటుంది. మొదటి సారి రెండు స్వరాల్లో రాం అన్నవాడు రెండవసారి రాం అనేప్పుడు అయిదు స్వరాలను వాడతాడు. దీంతో రెండోసారి రాం అనటంలో అభ్యర్థన తీవ్రత తెలుస్తుంది. ఈ తీవ్రతలో మృదుత్వం వుంటుంది. ఆవేదనవుంటుంది. మరెవ్వరూ ఇలా పాడలేరు. అద్భుతమైన గాన సంవిధానం ఇది.

**ననా కుఛ్ తేరా, నా కుఛ్ మేరా**

**యే జగ్ జోగీ వాలా ఫేరా**

**రాజా హో యా రంక్ సభీ కా**

**అంత్ ఏక్ స హోయీ**

ఈ ప్రపంచంలో ఏది నీదికాదు. నాది కాదు. ఇక్కడ రాజు అయినా, పేద అయినా అందరి జీవితం ఒకేరకంగా సమాప్తం అవుతుంది. మరణం తప్పదు రాజుకయినా, పేదకయినా.

**బాహర్ కే తూ మాటీ ఫాంకే**

**మన్‌కే భీతర్ క్యూ న ఝూంకే**

**ఉజ్‌లే తన్ పర్ మాన్ కియా ఔర్**

**మన్ కే మైల్ న ధోయీ...**

ఇలా సరళమైన పదాలలో సున్నితమైన భావం పొదిగాడు. మనం పైనున్న మట్టిని చూస్తున్నాం కానీ మనస్సు లోపలకు చూడటంలేదు. పైకి కనబడే శరీరాన్ని చూసి గర్విస్తున్నాం కానీ మనస్సులోని మురికిని కడిగే ప్రయత్నం చేయటంలేదు. నాయకుడు ఈ పాట పాడేసరికి మనకు నాయకుడి మనస్తత్వం అర్ధమయిపోతుంది. సినిమాలో తరువాత తన అమాయకత్వంతో నాయకుడు చేయని నేరానికి శిక్షను అనుభవించటం స్వీకరిస్తాం.

'షాగిర్ద్' అనే సినిమాలో ఓ అలవాటయిన సన్నివేశం ఉంటుంది. నాయిక అమాయకురాలు. చదువులేని పల్లెటూరి పిల్ల. నాయకుడు ధనవంతుడు. విద్యావంతుడు. నాయికను ఇంటికి తెస్తాడు. తెల్లారి నాయిక ఇంట్లో అందరికన్నా ముందు లేచి పూజ ఆరంభిస్తుంది.

**కాన్‌హా కాన్‌హా ఆన్ పడీ మై తేరి ద్వార్**

**మోహె చాకర్ సమఝ్ నిహార్.**

'కృష్ణా నీ ద్వారం వచ్చి చేరాను. నన్ను నీ సేవకునిగా భావించుకో' అంటోంది నాయిక. 'లక్ష్మీ కాంత్ ప్యారేలాల్' సంగీత దర్శకత్వం వహించిన ఈ పాట రాసింది మజ్రూహ్ సుల్తాన్ పురి. మజ్రూహ్ సుల్తాన్ పురి కూడా రాయనటువంటి పాటలేదు. అయితే ఆయన గేయరచయితగా తన ప్రత్యేకతను సినీ పరిధిలో ఒదిగింపచేసిన అసలైన సినీ గేయ రచయిత. అందుకే అరవై ఏళ్ల పైగా సినీ గేయ రచయితగా అగ్రస్థాయిలో ఉన్నాడు.

నాయిక విద్యాగంధం లేనిది. కానీ ఉదయాన్నే లేచి భక్తి భావంతో తన్మయురాలై కృష్ణగీతం గానం చేస్తుంది. ఈ పాట ఒకవైపు చూస్తే నాయిక సంపూర్ణంగా కృష్ణుడి ప్రేమలో తనని తాను కోల్పోయి పాడినట్టు అనిపిస్తుంది. తనను తాను రాధికలా భావించుకుంటూ కృష్ణుడికి సమర్పించుకుంటున్నట్టు అనిపిస్తుంది. మరోవైపు నుంచి చూస్తే నాయకుడిని కృష్ణుడిగా భావిస్తూ, తనని తాను రాధికగా, అతని ప్రేయసిగా భావించుకుంటూ తనని స్వీకరించమని అభ్యర్ధిస్తూ సంపూర్ణంగా సమర్పించుకుంటున్నట్టనిపిస్తుంది. రెండు వైపులా పదునైన కత్తిలాంటి భక్తిగీతం ఇది. ఓ వైపు భక్తి, మరోవైపు రొమాన్స్. 'కాలాబజార్'లో శైలేంద్ర 'ఆప్ ని తొ హర్ ఆహ ఎక్ తుఫాన్ హై' అన్న పాటను ఇలాగే

ద్వంద్వార్ధంతో రచించాడు. పాట చిత్రీకరణ రెండు అర్ధాలు బోధపడేట్టు ఉంటుంది. కానీ 'షాగిర్ద్'లోని ఈ పాటలోని రెండో అర్ధం సినీ నిర్మాత, దర్శకులకు అంతగా బోధపడినట్టు అనిపించదూ చిత్రీకరణ చూస్తే మామూలుగా ఉంటుంది.

**తూ జిసె చాహే ఐసీ నహీ మై**

**హా తెరీ రాధ జైసీ నహీ మై**

**ఫిర్ భీ హు కైసీ, కైసీ నహీ మై**

**కృష్ణా, మోహె దేఖ్ తొ లే ఎక్ బార్....**

నువ్వు ఎలాంటిదాన్ని కోరుతున్నావో నేను అలా లేను. నీ రాధలాంటి దాన్ని కాను నేను. అయినా అలాంటి ఇలాంటిదాన్ని కాను. కృష్ణా ఒక్కసారి నన్ను చూడు. నీకే తెలుస్తుంది అంటుంది నాయిక. నాయకుడు విద్యావంతుడు. ఆమె చదువులేనిది. నాయకుడు విద్యావంతురాలినే కోరుకోవటంలో ఆశ్చర్యం లేదు. కానీ, ఆమె అలాంటి ఇలాంటిది కూడా కాదు. ఒక్కసారి తనని చూస్తే తానెలాంటిదో తెలుస్తుంది అని బ్రతిమిలాడుతోంది. విన్నవించుకుంటోంది. హృద్యమైన భావం అందమైన రాగం ఇది. దాంతో పాట ఒక విన్నపంలా వినిపించే గీతంలా ఎదిగింది.

**బూంద్ హి బూంద్ మై ప్యార్ కి చున్ కర్**

**ప్యాసీ రహీ మైన్ పర్ లాయీ హు గిరిధర్**

**టూట్ హి జాయే , ఆస్‌కి గాగర్**

**మోహనా, ఐసీ కాంకరియా నహీ మార్...**

కృష్ణుడు కొంటెవాడు. కనబడిన వారందరినీ ఏడిపించేవాడు. అలాంటివాడు తనపై ఆధారపడే వారిని ఇంకా ఏడిపిస్తాడు. అందుకని ముందే తనని అలా ఏడ్పించవద్దని కోరుతోంది. అతి చక్కని సున్నితమైన గేయరచన ఇది. ఆమె ఒక్కో ప్రేమ చుక్కను ఎంచుకుని అతని కోసం తీసుకు వచ్చింది. ఆమె ఆశ అనే పాత్ర విరిగేట్టు రాళ్లు విసరవద్దు అంటోంది. కృష్ణుడు రాళ్లు విసిరి గోపికల నీటికుండలను పగుల గొట్టడం ఓ శృంగారం కృష్ణ చరితలో. దాని ఆధారంగా అతి అందమైన భావాల్ని అల్లాడు కవి మజ్రూహ్. అద్భుతంగా అనిపిస్తుందీ పాట వింటూంటే. లత పాడిన విధానం పరమాద్భుతం. ఆలాపనతోటే హృదయాన్ని దోచేసుకుంటుంది. రెండు కాన్హాలనూ ఒకే రకంగా పలకదు. మొదటి సారి పిలుపులో ఆర్తి, రెండో సారి పిలుపులో అభ్యర్ధన..రాను రాను ఒకరకమైన తీవ్రత ..ఇలా ప్రతి పదాన్ని దాని భావం ఇనుమడించేలా అనుభవిస్తూ పాడుతుంది లతా. అయితే, లతా గానసంవిధానంలో గమనించాల్సిన విషయం ఏమిటంటే ఆమె స్వరాలను పలికిస్తున్నట్టు తెలియకుండా దాట్లువేయటం..ఇంగ్లీషులో effortless అంటారు. ఒకే స్వరంలో ఒకేసారి అటు భక్తి, ఇటు శృంగారం ధ్వనించేట్టు పాడటం మానవ మాత్రులకు సాధ్యం కాదు. అది ఒక్క లతా మంగేష్కర్‌కే సాధ్యం. ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి అందమైన భక్తిగీతంలా అలరిస్తుంది లత స్వరం.

**మాటీ కరో యా స్వర్ణ బనాలో**

**తన్ కో మేరే చరణోంసె లగాలో**

**మురళీ సమఝ్ కర్ హాథోంసె ఉఠాలో**

**సోచోనా, కచ్చు అబ్,  హే కృష్ణ మురార్..**

ఇంకా సుందరమైన భావం. నన్ను మట్టి అనుకో, లేక స్వర్ణంలా మలచుకో. ఏది ఏమైనా నన్ను నీ పాదాల చెంత ఉండనీ. మురళి అనుకుని నీ చేతులలోకి తీసుకో. ఇంక ఏమీ ఆలోచించకు కృష్ణా. ఆమెను మట్టి అనుకున్నా, బంగారంలా మలచినా అంతా అతనిదే భారం. 'మురళీ సమఝ్ కర్ హాథోంసె ఉఠాలో

'అన్నప్పుడు లత గొంతులో ఒక మృదువైన భావం అలలా కదులుతుంది. ఆ భావం అనుభవించాలే తప్ప వివరించటం కుదరదు. ఈ పాటలో ప్రతి చరణంలో చివరి పాదంలో కృష్ణా, మోహనా, సోచోనా అంటూ లత దీర్ఘం తీసినప్పుడు, ఆ క్షణంలో అది వింటూ ప్రాణం పోతే అంతకన్నా గొప్ప అదృష్టం లేదనిపిస్తుంది. కృష్ణుడిలో లీనమవుతామనిపిస్తుంది.

ఒక సినిమాలో పాటకోసం ఏర్పాటు చేసిన మామూలు రొటీన్ సందర్భంలో ఇంత అద్భుతమైన పాటను రూపొందించిన కళాకారుల ప్రతిభ ఆశ్చర్యం కలిగిస్తుంది వారికి కళాసృజన ఒక తపస్సు అనిపిస్తుంది.

ఇలాంటిదే సందర్భం 'ఏక్‌ఫూల్ చార్ కాంటే' అనే సినిమాలో ఉంటుంది. నాయకుడు ఓ అల్లరి పిల్లను ప్రేమిస్తాడు. అయితే ఆమెకు నలుగురు పెద్దవాళ్లు ఉంటారు. వాళ్లు నలుగురు నాలుగు రకాలు. దాన్లో ఒకాయనకి భక్తి పిచ్చి. ఆమె గుడిలో భక్తిగీతం పాడుతూంటే హీరో చూసి ఆశ్చర్యపోతాడు. అల్లరి పిల్లకి ఇంత భక్తి ఏమిటని? అది అల్లరియా? నటనా? అని శంకిస్తాడు. పాటంతా నాయిక భక్తితత్వ సాగరంలో తన్మయమై మునకలేస్తూ పాడుతూంటే నాయకుడు వ్యంగ్యంగా, వంకర నవ్వుతో చూస్తూంటాడు. దాంతో పాటలో భక్తి భావం చిత్రీకరణలో పల్చనవుతుంది. ఈ పాటను వింటూంటే దృశ్యం కనబడక పోవటం వల్ల పాట ప్రభావం భక్తి పారవశ్యానికి గురిచేస్తుంది.

**బన్ వారీ రే జీనేక సహారా తెరా నాం రే**

**ముఝే దునియా వాలోంసె క్యాకాం రే.**

'కృష్ణా, జీవితానికి ఆధారం నీవే. నువ్వుండగా నా వెంట నాకింక ఇతరులతో పనేం ఉంది!' ఇదీ పల్లవి భావం. 'పీలూ' రాగంలో శంకర్ జై కిషన్ రూపొందించిన ఈ పాట రాసింది హస్రత్ జై పురి

**ఝూఠీ దునియా, ఝూఠే బంధన్, ఝూఠీ హై యే మాయా**

**ఝూఠా సాంస్ క  ఆనా జానా, ఝూఠీ  హై యే కాయా,**

**య హా సాచోం తేరా నాం రే.**

గమనిస్తే ఈ పాటలో ఈ చరణం భావంతో 'సుఖ్ కే సబ్ సాథీ' భావం మాత్రమే కాదు వాడిన పదాలలోనూ సామ్యం కనిపిస్తుంది. అబద్ధం ప్రపంచం, అబద్ధం బంధనాలు, ఈ మాయ అబద్ధం, ఊపిరి వచ్చిపోవటం అబద్ధం, ఈ శరీరం అబద్ధం. ఇక్కడ సత్యమైనది నీ పేరు ఒక్కటే. దాదాపుగా ఒకే రకమైన పదాలు, భావం అయినా 'సుఖ్ కే సబ్ సాథీ' పాట కలిగించే స్పందనకు, ఈ పాట కలిగించే స్పందనకు తేడా ఉంది. దీనికి ప్రధాన కారణం సందర్భాన్ని పట్టి సంగీత దర్శకుడు పాటను రూపొందించేందుకు ఎంచుకున్న రాగం.

'గోపీ' సీరియస్ సినిమా. దాన్లో హీరో, ఈ పాట తరువాత అనేక కష్టాలు పడతాడు. దాంతో పాటను సీరియస్‌గా, రాబోయే విషాద సంఘటనలను స్పురించే రీతిలో రూపొందించాల్సి ఉంటుంది. ఒక్కసారి పాటకు రాగం ఎన్నుకున్న తరువాత గాయకుడు ఆ రాగాన్ని అనుసరించి ఎక్కడెక్కడ ఎలాంటి అలంకారాలు వేయాలి, భావ ప్రకటన ఏ స్వరం వద్ద ఏ పదం వద్ద ఎలా చేయాలి అని పాటకు వన్నె తెస్తాడు. 'సుఖ్ కే సబ్ సాథీ ' పాటలో 'మేరె రాం ' అని రఫీ రెండు సార్లూ రెండు రకాలుగా అంటాడు.

'బన్వారీ రే' పాటను శంకర్‌జైకిషన్' 'పీలు' రాగంలో రూపొందించారు. ఇది ప్రఫుల్లత, ఆనందిత, లావణ్యమయి రాగం. సంతోషకరమైన సందర్భాలలో వాడతారీ రాగాన్ని. 'ఏక్‌ఫూల్ చార్ కాంటే' హాస్య రస ప్రధాన చిత్రం. దాంతో సినిమా పాటలలో గంభీరమైన రాగాలు వాడాల్సిన అవసరం అంతగా ఉండదు. అందుకని భక్తి పాటను కూడా వేగంగా, ఆనందం కలిగించే రాగంతో రూపొందించాడు. లతా మంగేష్కర్ కూడా పాటను భక్తి భావంతో పాడినా చిలితనం ధ్వనించేట్టు పాడింది.

**రంగ్ మె తేరే రంగ్ గయీ గిరిధర్, ఛోడ్ దియా జాగ్ సారా**
**బన్ గయి తేరే, ప్రేంకి జోగన్ లేకర్ మన్ ఇక్ తారా**
**ముఝే ప్యారా తేరా ధామ్ రే,**

నీ ప్రేమలో సర్వం మరచి ప్రపంచాన్ని త్యజించాను. మనస్సు అనే ఎక్‌తారా చేపట్టి నీ ప్రేమలో యోగిని అయిపోయాను (మీరాలాగా). నువ్వుండే స్థలమే నాకు ప్రియం. సులభమైన అర్థం. భక్తి, ప్రేమ తత్వాలను కలగలిపిన భావం.

**దర్శన్ తేరా జిస్ దిన్ పావూ, హర్ చింతా మిట్ జాయే,**
**జీవన్ మేరా ఇన్ చరణోంమే ఆస్ కి జ్యోతి జలాయే**
**మేరి బాహ పకడ్‌లోశ్యాం రే ...**

నీ దర్శనం పొందిన రోజే, నా కష్టాలు అన్నీ తొలిగిపోతాయి. నా జీవితం నీ చరణాల వద్ద ఆశాదీపాన్ని వెలిగిస్తుంది. నా చేయి పట్టుకుని నడిపించు అని అంటోంది. సుందరమైన గీతం. సందర్భానికి సరిపోతుంది. విడిగా వింటే అద్భుతమైన భక్తి భావం కలుగుతుంది.

ఈ మూడు భక్తి గీతాలు మన సినిమాల్లో భక్తి పాటలతో మన కళాకారులు చేసిన చమత్కారానికి మచ్చు తునకలు. ఇంకా పలు రకాల భక్తిపాటలున్నాయి. ఆ పాటలను మనస్సు మురిసేలా, రెక్కలు కట్టుకుని ఆకాశంలోకి ఎగిసేలా రూపొందించారు. పరమాద్భుతమైన ప్రయోగాలు చేశారు.

*(మరికొన్ని ఇలాంటి భక్తిగీతాలు వచ్చేనెల 'మ్యూజికల్ మ్యూజింగ్స్'లో)*

Post your comments